# అలంకరణ ఆగమాగం..

## నిర్వహణ లేక నిరుపయోగం

- నిర్మల్‌లో ఫుట్‌పాత్ రివెలింగ్ మొక్కలపై అధికారుల నిర్వాకం
- కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఆహ్లాదం..
- ప్రస్తుతం పగుళ్లు.. కుండీల్లో కనిపించని మొక్కలు
- యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు


నిరుపయోగంగా ఉన్న సిమెంట్ కుండీలు

నిర్మల్ టౌన్, మార్చి 27 : నిర్మల్ బల్దియాలో పౌరులకు ఆహ్లాదం అందించేందుకు ఏర్పాటు చేసిన పూల మొక్కల లక్ష్యం నీరుగారుతున్నది. లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్ రివెలింగ్ మొక్కల నిర్వహణను మున్సిపల్ యంత్రాంగం గాలికొదిలేసింది. కేసీఆర్ ప్రభుత్వం అన్ని మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున తెలంగాణకు హరితహారంలో భాగంగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించారు. ఇందులో భాగంగా పట్టణంలో అప్పటి కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు సమారు రూ.కోటితో పట్టణంలో రోడ్డుకు ఇరువైపులా పాదాచారుల కోసం ఫుట్‌పాత్ రివెలింగ్ నిర్మించారు. మంచిర్యాల చౌరస్తా నుంచి డాక్టర్ లైన్ వరకు రెండు వైపులా ఫుట్‌పాత్‌తో పాటు లోపల పూల మొక్కలను పెంచేందుకు సిమెంట్ కుండీలను ఏర్పాటు చేశారు. అందులో పూల మొక్కలు, అలంకరణ మొక్కలు నాటారు. వాటికి ప్రతిరోజూ మున్సిపల్ టాంకర్‌తో నీళ్లు పట్టించారు. దీంతో మొక్కలు పెరిగి ప్రజలకు ఆహ్లాదం కలిగించాయి. కానీ, ఇది మూడునాళ్ల ముచ్చటగానే మిగిలింది. తర్వాత ఎన్నికలు రావడం.. అధికారులు వీటి నిర్వహణపై నిర్లక్ష్యం ప్రదర్శించడంతో ప్రస్తుతం మొక్కల జాడ లేకుంగా పోయిందని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫుట్‌పాత్‌లపై కొందరు అక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేసుకోవడం, పార్కింగ్‌గా ఉపయోగించడం, ప్రైవేట్ వారికి అడ్డాలుగా మారిపోయింది. ఫుట్‌పాత్ పగుళ్లు తేలడం, స్టీలు ఊడిపోవడం, ఇనుప కడ్డీలు తుప్పు పట్టడంతో ప్రభుత్వ నిధులు నిరుపయోగమయ్యాయని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ముఖ్యంగా కలెక్టర్, ఆర్డీవో, ఫారెస్టు, జడ్పీ, ఎస్పీ, తదితర కార్యాలయాలు ఉన్న ప్రతి చోటా ఇదే పరిస్థితి. ఎండాకాలంతో ఉదయం, సాయంత్రం వేళలో పాదాచారులకు సేద తీర్చేందుకు ఇది ఉపయోగపడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


గుంతలు ఏర్పడ్డ రివెలింగ్


ఎండిపోతున్న మొక్కలు

# ఎన్నికల వేళ.. ప్రత్యేక నిఘా

ఖానాపూర్, మార్చి 27 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిబంధనలు పాటించాలని ఎన్నికల సంఘం కోడ్‌ను అమలు చేసింది. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నిబంధనలు ఉల్లంఘించకుండా ప్రత్యేక నిఘా కోసం వాహనాలు ఏర్పాటు చేసింది. ఈ వాహనానికి పైన సీసీ కెమెరా అమర్చింది. ఈ వాహనంలో ప్రత్యేక తనిఖీ బృందం ఉండగా, ఒక స్పెషల్ స్క్వాడ్ అధికారి, ఏఎస్‌ఐతో పాటు కెమెరామన్, నలుగురు పోలీస్ కానిస్టేబుళ్లు ఉన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో నిత్యం ఖానాపూర్, పెంబి, దస్తురాబాద్ మండలాల్లో ఈ బృందం పర్యవేక్షిస్తున్నది. ఈ తనిఖీ బృందం రాజకీయ పార్టీల కార్యక్రమాలు, ర్యాలీలు, మద్యం, డబ్బు అక్రమంగా తరలిస్తున్న ప్రదేశాలు వెళ్తే చాలు అక్కడ జరిగిన సంఘనలు సీసీ కెమెరాల ద్వారా నేరుగా ఎన్నికల సంఘం అధికారులకు సమాచారం అందిస్తుంది. దీంతో ఎన్నికల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటారని తనిఖీ బృందం అధికారులు పేర్కొన్నారు. కాగా, బుధవారం ఖానాపూర్ పట్టణంలో పర్యవేక్షిస్తూ 'నమస్తే తెలంగాణ' కెమెరాకు కనబడింది.


ఖానాపూర్ : నిఘా కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనం

### దస్తురాబాద్‌లో..

దస్తురాబాద్, మార్చి 27 : ఎన్నికల సంఘం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. ప్రత్యేక బృందం కోసం ఏర్పాటు చేసిన వాహనానికి సీసీ కెమెరాను ఏర్పాటు చేసింది. కాగా, దస్తురాబాద్ మండలంలో మంగళవారం రాత్రి ప్రత్యేక బృందం పర్యటించింది. వివిధ పార్టీల రాజకీయ నాయకులు ఏర్పాటు చేసుకునే కార్యక్రమాలు, అభ్యర్థులు నిర్వహించే ర్యాలీల దగ్గర, కూడళ్ల వద్ద, వాహనాల తనిఖీ చేపట్టినప్పుడు ఆ సీసీ కెమెరాలో నిక్షిప్తమై కేంద్ర ఎన్నికల సంఘానికి సమాచారం తెలిసిపోతుంది. మండలానికి వచ్చిన ప్రత్యేక నిఘా అధికారుల బృందంలో ఏపీఎం గంగాధర్, ఏఎస్‌ఐ దేవు, సిబ్బంది తదితరులున్నారు.



దస్తురాబాద్ : వాహనాల తనిఖీ కోసం వచ్చిన అధికారుల బృందం

## నేడు సర్వసభ్య సమావేశం

కుంటాల, మార్చి 27 : మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటల నుంచి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రహీం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

## బాధితులపై చర్యలు తీసుకోవాలి


ఎస్పీకి వినతి పత్రం అందిస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

నిర్మల్ అర్బన్, మార్చి 27 : తోకల రాజేశ్ ఆత్మహత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిలకు మున్నూరుకాపు ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. వినతి పత్రం అందించిన వారిలో జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు ఏ గంగాధర్, బారె శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు సుజయ్, శ్రీహరి, సరిత, పెంట అశోక్, మైస అరవింద్ కుమార్, నర్సయ్య తదితరులున్నారు.

## అలరించిన నృత్యాలు


నృత్యం చేస్తున్న విద్యార్థినిలు

భైంసా, మార్చి 27 : రంగస్థలం దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని మేధా పాఠశాలలో రంగస్థల నృత్య కార్యక్రమాలు అలరించాయి. పాఠశాలలోని పలువురు విద్యార్థినిలు నృత్యాలను ప్రదర్శించారు. పుండలిక్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయినాథ్, అకాడమిక్ డైరెక్టర్ సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలతో నేరాలను అరికట్టవచ్చు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ సైదారావు

పెంబి, మార్చి 27: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అరికట్టవచ్చని ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. పెంబి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఎస్‌ఐ శంకర్ ఆధ్వర్యంలో వ్యాపారులు, ప్రజలకు సీసీ కెమెరాలపై అవగాహన కల్పించారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని సూచించారు. ప్రతి వ్యాపారి తమ షాపుల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండల కేంద్రంలోని పలు ప్రదేశాల్లో పోలీసుల ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎస్‌ఐ శంకర్ వీడీసీ నాయకులు, వ్యాపారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సద్వినియోగం చేసుకోవాలి


సమావేశంలో పాల్గొన్న చైర్మన్, డైరెక్టర్లు

కుంటాల, మార్చి 27 : రైతులు పంట రుణంతో పాటు అందించే రూ.2 లక్షల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ సట్ల గజ్జారాం అన్నారు. ప్యాక్స్ కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ సీజన్‌లో మక్క కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, విత్తనాలు, ఎరువుల సరఫరాపై చర్చించారు. గతంలో కొందరి సభ్యుల అవిశ్వాస తీర్మాణంతో బల నిరూపణ పరీక్ష తర్వాత జరిగిన ఈ మొదటి జనరల్ బాడీ మీటింగ్‌లో డీసీసీబీ డైరెక్టర్ తుర్పాటి వెంకటేశ్, వైస్ చైర్‌పర్సన్ గుద్దేటి లావణ్య, డైరెక్టర్లు, సెక్రటరీ నాగభూషణ్, సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ

సారంగాపూర్, మార్చి 27 : మండలంలోని సిరిపెల్లి చెక్‌పోస్టు వద్ద రూరల్ సీఐ శ్రీనివాస్ బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. నిర్మల్, మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలను ముమ్మరంగా పరిశీలించారు. మద్యం, రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లవద్దని సూచించారు. ఇందులో ఎస్‌ఐ చంద్రమోహన్, పోలీసులు పాల్గొన్నారు.



తమ పిల్లలను కిటికీలో నుంచి ఎక్కిస్తున్న ప్రయాణికులు


కిటికీ నుంచి బస్సు ఎక్కుతున్న యువకుడు

# ఉచిత ప్రయాణం పాట్లు


బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు

నిర్మల్ టౌన్, మార్చి 27 : నిర్మల్ బస్టాండ్ బుధవారం సాయంత్ర ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. బస్సులు లేక జనం అవస్థలుపడ్డారు. ఫ్రీ బస్సు సౌకర్యం పుణ్యమా అని ఏ ప్లాట్‌ఫామ్‌లో చూసినా ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి వేచిచూడాల్సి పరిస్థితి నెలకొన్నది. వచ్చిన బస్సుల కంటే జనమే ఎక్కువగా ఉండడంతో బస్సురాగానే ఎక్కేందుకు ఎగబాడ్డారు. ముఖ్యంగా చిన్న పిల్లలను సీట్ల కోసం కిటికీలో నుంచి లోపలికి ఎక్కిస్తూ ఇబ్బందిపడ్డారు. యువకులు సైతం సీట్ల కోసం కిటికీల ద్వారా ఎక్కారు. బస్సులో సైతం నిలబడేందుకు స్థలం లేక ఫుట్‌బోర్డు వద్ద ప్రమాదకరంగా ప్రయాణానిన సాగిస్తూ ప్రభుత్వానికి శాపనార్థాలు పెట్టారు.

## ఒకరి ఆత్మహత్య


రాజు (ఫైల్)

భైంసాటౌన్, మార్చి 27 : మండలంలోని టాక్లి గ్రామానికి చెందిన తలపుల రాజు (32) బుధవారం నీటి ట్యాంక్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజు మద్యానికి బానిసవగా, అతని భార్య సవిత రెండు నెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్థాపానికి గురైన రాజు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా దవాఖానకు తరలించారు. రాజుకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. తండ్రి శివయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టండి


సమావేశానికి హాజరైన అధికారులు

ఖానాపూర్ రూరల్, మార్చి 27 : ప్రతి గ్రామంలో ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా నీటి ఎద్దడి నివారణకు పక్కాగా చర్యలు చేపట్టాలని జడ్పీసీఈవో గోవింద్ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు ఖానాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో కడెం, ఖానాపూర్, పెంబి, దస్తూరాబాద్ మండలాల గ్రామీణ నీటి పారుదల, పంచాయతీ, పురపాలక శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలో పాడైన బోర్లను ఎప్పటికప్పుడు బాగుచేయాలని సూచించారు. నీటి వాడకం, చెరువులు, కుంటలను పరిరక్షించుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అన్ని గ్రామాల్లో చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. డీపీవో శ్రీనివాస్, డీఎల్‌పీవో రమేశ్, మిషన్ భగీరథ ఈఈ సందీప్, ఎంపీడీవో సునిత, ఎంపీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# పౌష్టికాహారం తీసుకోవాలి



రేవోజీపేటలో పోషన్ పక్వాడ వారోత్సవాలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

దస్తురాబాద్, మార్చి 27 : క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవాలని ఉపాధ్యాయురాలు శిరీష అన్నారు. మండలంలోని ఆకొండపేట, రేవోజిపేట, గొడిసేర్యాలలోని అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణ్ పక్వాడ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం, చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. పోషక పదార్థాలు తీసుకుంటే కలిగే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు, వీవోఏలు, గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ అధికారుల అవగాహన


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్టీసీ సూపర్ వైజర్ నర్సయ్య

సారంగాపూర్, మార్చి 27 : మండలంలోని మల్లక్‌చించోలి గ్రామంలో బుధవారం ఆర్టీసీ అధికారులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ సూపర్‌వైజర్ నర్సయ్య మాట్లాడుతూ.. మహిళలు ధర్నా చేయడంతో బస్సు ట్రిప్పులను నాలుగు పెంచామన్నారు. డీఎం ప్రతిమారెడ్డి చొరవ తీసుకున్నారని, ప్రజలు ప్రైవేటు వాహనాలోల ఎక్కడంతో బస్సు ఖాళీగా వస్తున్నదని తెలిపారు. పెంచిన బస్సు ట్రిప్పులను తగ్గిస్తామని చెప్పడంతో ప్రైవేటు వాహనాలు రానీయబోమని, ఎవరైనా ఎక్కితే జరిమానా విధిస్తామని గ్రామస్తులు తీర్మానం చేసి అధికారులకు చెప్పారు. ఇందులో మాజీ సర్పంచ్ చిన్నవ్వ, పోసక్క, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

## డాక్టర్ లేన్స్‌లో అగ్నిప్రమాదం

నిర్మల్ అర్బన్, మార్చి 27 : నిర్మల్ పట్టణం డాక్టర్స్ లేన్‌లోని ఓ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించినట్లు అగ్ని మాపకశాఖ అధికారి జయంత్ రామ్ తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్తాచెదారం ఉండడంతో ఆకతాయిలు నిప్పంటించారు. స్థానికులు అగ్నిమాపక శాఖ కార్యాలయానికి సమాచారం అందించడంతో మంటలను ఆర్పి వేశా రు. పెను ప్రమాదం తప్పినట్లు అధికారులు తెలిపారు.

భైంసా, మార్చి 27 : పట్టణంలోని అగ్రికల్చర్ గోదాములో ప్రమాదవశాత్తు మంటల చెలరేగాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి తెలియజేయడంతో వెంటనే స్పందించి మంటలను ఆర్పివేశారు. ఎలాంటి ఆస్తి నష్టం వాటిల్లలేదు.

## ఆర్థిక సాయం

భైంసా, మార్చి 27 : బిద్రెల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సాయినాథ్ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబానికి పట్టణంలోని పీఆర్టీయూ భవనంలో బుధవారం రూ. లక్ష చెక్కును యూనియన్ తరపున అందజేశారు. వారి కుటుంబానికి ఇక ముందు అండగా ఉంటామని లిపారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారావు, పీఆర్టీయూ నాయకులు గంగాధర్, రవీందర్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి, గజ్జారాం, రమేశ్ రెడ్డి, వందన, పుండలిక్, నర్సింలు, పోతన్న, భైంసా ఎంఈవో సుభాష్, గజ్జారాం, గోపాల్, అహద్ ఉన్నారు.

## వరిలో సస్య రక్షణకు చర్యలు

ఖానాపూర్, మార్చి 27 : వరి పంటలో ఉస తిరుగుడు నివారణకు తగిన సస్య రక్షణ చర్యలు చేపడితే సరైన దిగుబడి లభిస్తుందని ఖానాపూర్ ఏవో ఆసం రవి సూచించారు. పట్టణంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. వరి పొట్ట దశలో మొగి పురుగు ఆశించినట్లయితే కెల్డన్ లేదా నాగర్జున 4జీ గులికలను ఎకరాకు 8 కిలోలు చల్లుకోవాలని సూచించారు. మొగి రోగం ఎక్కువగా ఉంటే ఆయా క్లస్టర్ల ఏఈవోలను సంప్రదించాలని సూచించారు.

## కరెంట్ ఇవ్వండి


విద్యుత్ అధికారికి వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

పెంబి, మార్చి 27 : మండలంలోని మారుమూల రాగిదుబ్బ గ్రామంలో కరెంట్ లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో బుధవారం లైన్‌మన్ సత్యంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు మాట్లాడుతూ.. రాగిదుబ్బ గ్రామంలో 40 కుటుంబాలు ఉంటున్నాయని, ఇప్పటికీ అంధకారంలో బతుకుతున్నాయన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని కోరారు.

## వంతెన పనుల పరిశీలన

ఖానాపూర్ రూరల్, మార్చి 27 : ఖానాపూర్ మండలం దిలావర్‌పూర్ రెంకోని వాగు వంతెన నిర్మాణ పనులను ఈఈ అశోక్ కుమార్, క్వాలిటీ కంట్రోల్ ఏఈఈ అరుణ్‌కృష్ణ పరిశీలించారు. పనులను వేగవంతం చేసి, నాణ్యతతో చేపట్టాలన్నారు. వంతెన ప్రతీ పిల్లర్‌ను పరిశీలించారు. నీటి ప్రవాహం తాకకుండా వంతెన ఎత్తు పరిశీలించారు. వారి వెంట ఏఈఈలు రఘు, విజయలక్ష్మి ఉన్నారు.

## అనుమానాస్పద స్థితిలో యాచకుడి మృతి

నిర్మల్ అర్బన్, మార్చి 27 : నిర్మల్ పట్టణంలోని సోఫీ నగర్ కాలనీలో యాచకుడు నర్సయ్య (75) అనుమానాస్పదంగా మృతి చెందాడు. 15 ఏండ్ల నుంచి నర్సయ్య ఇక్కడ ఇంటింటా తిరుగుతూ భిక్షాటన చేస్తూ బతికేవాడు. మంగళవారం రాత్రి పడుకొని బుధవారం ఉదయం లేవకపోవడంతో కాలనీవాసులు గమనించారు. అప్పటికే ఆయన మృతి చెంది ఉన్నాడు. కాలనీవాసులు పోలీసులకు సమాచారం అందించారు. పెట్రో కార్ సిబ్బంది అక్కడికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# అనుకూల రకాలను ఎంచుకోవాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

**డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పీ రఘురాంరెడ్డి**

జగిత్యాల టౌన్, మార్చి 27 : ఉత్తర తెలంగాణ మండల రైతులు పంటలను సాగు చేసే ముందు వాతావరణ అనుకూల రకాలను ఎంచుకోవాలని డైరెక్టర్ ఆఫ్ రీసర్చ్ డాక్టర్ పీ రఘురాంరెడ్డి తెలిపారు. పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో బుధవారం విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకుడు డాక్టర్ రఘురామిరెడ్డి, విస్తరణ సంచాలకుడు డాక్టర్ సుధారాణితో పాటు అనుబంధ శాఖల అధికారులతో ఉత్తర తెలంగాణ మండల పరిశోధనా విస్తరణ సలహా సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘురాంరెడ్డి మాట్లాడుతూ.. సరైన శాస్త్రీయ, సాంకేతిక యాజమాన్య పద్ధతులను రైతులు పాటించడం వల్ల అనుకున్న దాని కంటే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతులు ఒక్క వరి పంటపైనే ఆధారపకుండా ఇతర రకాలను కూడా ఎంచుకోవాలని సూచించారు. మార్కెట్‌లో ఎక్కువ అవసరం ఉన్న పంటలపై దృష్టి పెట్టడం వల్ల రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చన్నారు. అలాగే పరిశోధనా స్థానం ద్వారా రైతులు సూచనలు, సలహాలు తీసుకోవడం వల్ల పంట నష్టం జరుగకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. అవసరానికి అనుకూలంగా మాత్రమే ఎరువులు, పురుగు మందులను వాడాలని సూచించారు. పురుగు మందులను ఎక్కువ మోతాదులో వాడకుండా పురుగులను గుర్తించి, వాటి నివారణకు సరియైన మందులను మాత్రమే వాడాలని వివరించారు. అనంతరం పొలాస వ్యవసాయ పరిశోధనా స్థానం సంచాలకుడు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. గతేడాది జరిగిన పరిశోధనా ఫలితాలను రైతులకు వివరించారు. వరి, చెరుకు, పత్తి, సోయ, శనగ వంటి పంటలపై పరిగిన పరిశోధనలను రైతులకు వివరించారు. గతేడాది వాతావరణ మార్పులు, వర్షాపాతం, ఏ జిల్లాలో ఏ మోతాదులో ఉన్నదో సూచిస్తూ చీడపీడల వ్యాప్తితో ఎంత మోతాదులో పంట నష్టం జరిగిందో తెలిపారు. అనంతరం రైతుల ప్రశ్నలకు వివిధ పంటల్లో ఏర్పడ్డ మార్పులపై ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జీ మంజులత వివరించారు. ఆదిలాబాద్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్ విస్తరణకు సంబంధించిన ఫలితాలను రైతులతో చర్చించి, వాటి ఫలితాలను వివరించారు. ఉత్తర తెలంగాణలోని 10 జిల్లాల వ్యవసాయ అధికారులు వారి జిల్లాల్లో ఉన్న పంటలు, ఆ పంటల్లో ఉన్న సమస్యలను, చిరుసంచుల దశలో ఉన్న వివిధ రకాల పంటల రకాల ఫలితాలను ప్రజెంటేషన్ రూపంలో వివరించారు. ఈ సమావేశంలో సుమారు 250 మంది రైతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, అనుబంధ శాఖల అధికారులు, యూనివర్సిటీ ప్రధాన శాస్త్రవేత్తలు, యూనివర్సిటీ అధికారులు పాల్గొన్నారు.